క్లుప్తంగా

ఎస్సైలుగా ఇద్దరికి పదోన్నతి

యానాం: పుదుచ్చేరి పోలీస్ శాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు యానాంకు చెందిన వారికి ఎస్సైలుగా పదోన్నతులు కల్పిస్తూ శుక్రవారం ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆర్. ఎలుమలై ఆదేశాలు జారీ చేశారు. ఏఎస్సైగా యానాం స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జిల్లెళ్ల ప్రభాకరరావుకు, పుదుచ్చేరిలో విధులు నిర్వహిస్తున్న దయ్యాల ప్రకాశరావుకు ఎస్సైగా పదోన్నతి కల్పించారు. వీరు ఇప్పటికే డిపార్టమెంటల్ పరీక్షల్లో ఉత్తీర్ణత కావడంతో పదోన్నతులు లభించాయి.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం


తాళ్లరేవులో దసరా ఉత్సవాలకు పందిరిరాట వేస్తున్న భక్తులు

తాళ్లరేవు: దసరా ఉత్సవాలకు మండలంలోని పలు ఆలయాల వద్ద శుక్రవారం శ్రీకారం చుట్టారు. తాళ్లరేవు కేశవస్వామి బైపాస్ కాలనీలో విజయదుర్గ ఆలయం వద్ద వేద పండితుడు మర్ల హరిబాబు ప్రత్యేక పూజలు చేశారు. గేదెల సాయిసత్యనారాయణ, నాగలక్ష్మి దంపతులు ఉత్సవాలకు రాట ముహూర్తం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా నీలపల్లి చెక్‌పోస్టు సెంటర్‌లో కనకదుర్గాదేవి ఆలయం వద్ద ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

ఒత్తిడితోనే గుండె వ్యాధులు


బెలూన్లు ఎగురవేస్తున్న ఆర్డీఓ వసంతరాయుడు, డీఎస్పీ అంబికా ప్రసాద్

అమలాపురం రూరల్: ఆధునిక జీవనశైలి, ఒత్తిడి కారణంగా యువతలోనూ గుండె సంబంధిత సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని ఆర్డీఓ వసంతరాయుడు, డీఎస్పీ అంబికాప్రసాద్, మెడ్ యునైటెడ్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ హరికిరణ్‌వర్మ, కార్డియాలజిస్ట్ గురుకిరణ్ అన్నారు. మెడ్ యునైటెడ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా పేరూరు వై.జంక్షన్ నుంచి అమలాపురం ఆసుపత్రి వరకూ వాక్‌థాన్ నిర్వహించారు. అనంతరం కిమ్స్ ఆసుపత్రిలో కేక్ కట్ చేశారు. గుండె పరీక్షల ప్యాకేజీని కిమ్స్‌లో 30 రోజుల పాటు కేవలం రూ.999కే అందిస్తున్నారు. డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య, మెడికల్ సూపరింటెండెంట్ పి.సుబ్బారావు, గుండె వ్యాధుల వైద్య నిపుణులు అభిషేక్ రవివర్మ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ప్రతి ఒక్కరూ గుండె జబ్బులపై అవగాహన పెంచుకోవాలని సీఐ ఎన్.కొండయ్య అన్నారు. ముమ్మిడివరంలో పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్, యువభారత్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డేను నిర్వహించారు. ఆర్గనైజేషన్ గౌరవ అధ్యక్షుడు టి.నాగరాజారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కొండయ్య ముఖ్య అతిథిగా హాజరై స్థానిక కొండాలమ్మ చింత నుంచి 2కే వాక్‌ను ప్రారంభించారు. వైద్యుడు జె.శివకుమార్, రవీంద్ర విద్యాసంస్థల కరస్పాండెంట్ లక్ష్మీశ్రీనివాస్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకర్, యాపిల్ స్కూల్ అధినేత గోదశి పుండరీష్ పాల్గొన్నారు.

నేడు శిక్షణ తరగతులు

అమలాపురం రూరల్: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఓరియంటేషన్ శిక్షణ తరగతులు శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమలకుమారి శుక్రవారం తెలిపారు. కామనగరువులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి డివిజన్‌లోని అన్ని మండలాలు, రామచంద్రపురం డివిజన్‌లో మూడు మండలాలు కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం సైన్స్ ఉపాధ్యాయులు హాజరు కావాలన్నారు.

కళాసాహితీ వార్షికోత్సవం

ముమ్మిడివరం: స్థానిక డాక్టర్ రావుబహుదూర్ రఘుపతి వెంకటరత్నం నాయుడు మహిళా డిగ్రీ కళాశాలలో కళాసాహితీ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముంగండ ఆశీర్వాదం అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. పలువురు కవుల సాహితీ సేవలను కొనియాడారు.

8న పోస్టుల భర్తీకి పరీక్ష

యానాం: పుదుచ్చేరి స్టేట్ ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ శాఖలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అక్టోబర్ 8న రాతపరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్ష నిర్వహణకు పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్‌లలో 22 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని శుక్రవారం డిపార్టమెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ అధికారులు తెలిపారు.

కాంగ్రెస్ విజయం తథ్యం

యానాం: పుదుచ్చేరిలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని మాజీ సీఎం నారాయణసామి అన్నారు. శుక్రవారం పుదుచ్చేరిలో కాంగ్రెస్ పార్టీ సమావేశం పార్టీ అధ్యక్షుడు వైథిలింగం అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఎన్ఆర్, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదన్నారు. సమావేశంలో మాజీ మంత్రులు కందసామి పాల్గొన్నారు.

నిధుల ఒరవడి.. బాగుబడి

- పీఎంశ్రీతో ప్రభుత్వ బడులకు మహర్దశ
- తొలిదశలో మండలానికి ఓ పాఠశాల చొప్పున ఎంపిక

ఐ.పోలవరం: సర్కారు బడి మరింత సర్వాంగ సుందరంగా మారనుంది.. రేపటి పౌరులను తీర్చిదిద్దేందుకు అన్ని సౌకర్యాలతో ముస్తాబు కానుంది.. ఇప్పటికే నాడు- నేడు ద్వారా పాఠశాలల్లో ప్రభుత్వం పెద్ద ఎత్తున మౌలిక వసతులు కల్పిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ పథకాన్ని అమలులోకి తెచ్చింది. ఇందులో భాగంగా ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల పరిధిలో తొలిదశలో ఏడు పాఠశాలలు పీఎంశ్రీకి ఎంపికయ్యాయి. మండలానికి ఒకటి చొప్పున ఉన్నత పాఠశాలను ప్రైమినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి ఎంపిక చేశారు. అమలాపురం మండలం సమనస ఏపీఆర్ఈఎస్, అల్లవరం మండలం దేవగుప్తం జెడ్పీ హెచ్ఎస్, ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి జెడ్పీ హెచ్ఎస్, కాట్రేనికోన మండలం కాట్రేనికోన జెడ్పీ హెచ్ఎస్, ముమ్మిడివరం మండలం అనాతవరం జీహెచ్ఎస్, ఐ.పోలవరం మండలం ఐ.పోలవరం జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలను పీఎంశ్రీ పథకానికి ఎంపిక చేశారు. తొలుత మండలానికి రెండు



పీఎంశ్రీకి ఎంపికైన ఐ.పోలవరం ఉన్నత పాఠశాల

స్కూళ్లు ఎంపిక చేశారు. వీటిలో మళ్లీ జాతీయ స్థాయిలో ఒక పాఠశాల చొప్పున గుర్తించారు. పై పాఠశాలల్లో ప్రాథమిక విద్యలో సమూల మార్పులు తీసుకురావడం, మౌలిక వసతులు కల్పించడం చేస్తారు. ఈ పథకానికి కేంద్రం పూర్తి స్థాయిలో నిధులు సమకూర్చనుంది. పీఎంశ్రీ పథకం కింద గత ఏడాది తొలి దశలో ఒక్కో పాఠశాలను ఎంపిక చేశారు. రెండో దశకు సంబంధించి మరిన్ని పాఠశాలలు దరఖాస్తు చేసుకున్నాయి.

నిధులు.. అభివృద్ధి పనులు

- పీఎం శ్రీలో ఎంపికైన ఒక్కో పాఠశాలకు కేంద్రం ద్వారా రూ.70 లక్షల నుంచి రూ.1.50 కోట్ల వరకూ నిధులు విడుదల చేస్తారు. పాఠశాలల్లో విద్యాబోధన, సదుపాయాలు మరింత మెరుగు పరుస్తారు. అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా బోధన సామగ్రిని సమకూర్చుతారు.
- పాఠశాలలకు దశల వారీగా నేరుగా నిధులు కేటాయింపు జరుగుతోంది. డిజిటల్ పద్ధతిలో బోధన, ప్రయోగశాలలు, ఇతర వసతులు కల్పిస్తారు. ఉపాధ్యాయులకు శిక్షణతో పాటు ఆర్థిక, సాంకేతిక తోడ్పాటు అందిస్తారు.
- ప్రధానంగా పాఠశాలలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుతారు. దీంతో పాటు సంప్రదాయ విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. మొక్కలు నాటి హరిత పాఠశాలలుగా మార్పు చేస్తారు.
- పాఠశాల ఆవరణలో సేంద్రియ విధానంతో కూరగాయలు, ఆకుకూరల సాగు చేపట్టడం, దివ్యాంగ విద్యార్థులకు బోధన పరికరాలను సమకూర్చడం చేస్తారు. బాలికా విద్య అభివృద్ధి, సైన్స్ ప్రాజెక్టులకు ఎంపిక చేస్తారు.
- పాఠశాలల్లో గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు క్రీడా పరికరాలు, సోలార్ ప్యానల్స్, ఎల్ఈడీ విద్యుత్ దీపాల సౌకర్యం కల్పిస్తారు.

మరింత ప్రగతికి బాటలు



పీఎంశ్రీలో పాఠశాలలు మరింత ప్రగతి బాట పట్టనున్నాయి. నాడు–నేడుకు తోడు పీఎంశ్రీ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ రానుంది. విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు కావాల్సిన సౌకర్యాలు సమకూరనున్నాయి. ప్రైవేట్ స్కూళ్లతో పోటీ పడే విధంగా ప్రభుత్వ పాఠశాలలు తయారవుతాయి.

– వీది సురేష్‌బాబు, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, ఐ.పోలవరం

వానొచ్చే.. ముంచేసే


యానాంలో షేక్‌లాలా వీధిలో చేరిన వర్షం నీరు

యానాం: నియోజకవర్గంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం పడింది. దీంతో పలు వీధులు ముంపునకు గురయ్యాయి. ముఖ్యంగా యానాంలోని షేక్‌లాలా వీధి పూర్తిగా ముంపు బారిన పడింది. ఆ ప్రాంత నివాసితులు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఇక్కడి డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో ఆధునీకరించాలని స్థానికులు కోరుతున్నారు. అదేవిధంగా దోబీస్ట్రీట్, చింతావారి వీధి తదితర ప్రాంతాల్లో వర్షం నీరు భారీగా నిలిచిపోయింది. పిల్లారాయ ఆలయం, పోలీస్ స్టేషన్ వద్ద ఇటీవల నూతన డ్రైనేజీల నిర్మాణం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కృషితో జరగడంతో ఈ సారి వర్షం నీరు ఎక్కడా ఆగకుండా దిగువకు వెళ్లిపోయింది.

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీచెన్న మల్లేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కల్వకొలను బాబీకి గుండె శస్త్రచికిత్స జరగ్గా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.5.75 లక్షలు మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. విజయవాడలో ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి మంత్రి పినిపే విశ్వరూప్ తీసుకెళ్లగానే ఆయన తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో బాబీకి గుండె శస్త్రచికిత్స జరిగింది. దానికి రూ.5.75 లక్షల ఖర్చు అయింది. ఈ విషయాన్ని రాష్ట్ర వైఎస్సార్ సీపీ కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు మంత్రి విశ్వరూప్ దృష్టిలో పెట్టారు. విజయవాడలో శుక్రవారం జరిగిన వాహన మిత్ర కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్ సీఎం దృష్టికి తీసుకుని


బాబీ గుండె శస్త్రచికిత్సకు సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్న సీఎం జగన్, చిత్రంలో మంత్రి విశ్వరూప్

వెళ్లారు. దీనిపై సీఎం జగన్ స్పందించి నిధుల మంజూరుకు ఆదేశాలు జారీ చేశారు. సీఎం జగన్‌కు, మంత్రి విశ్వరూప్, పార్టీ నేత శ్రీనివాసరావుకు బాబీ కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు

అల్లవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మేలు జరుగుతుందని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఎంపీడీఓ కృష్ణమోహన్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చే రోగులు ఎక్కువ సేపు వేచి ఉండకుండా తగిన సమయంలో వైద్యుల సలహాలు అందించేలా సిబ్బంది సహకరించాలన్నారు. బోడసకుర్రు-2 సచివాలయంలో శనివారం ప్రారంభం కానున్న ఆరోగ్య సురక్షపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ వీరవెంకట సత్యనారాయణ, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శులు ఎ.రాజా, రాజమోహన్, ఎస్‌వీవీ సత్యనారాయణ, కేవీవీ సత్యనారాయణ, పి.శ్రీనివాస్, శ్రీరామ చంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద ఆయా వార్డుల్లో ఒకపక్క ఇంటింటా సర్వే, మరో పక్క వైద్య బృందాలతో పరీక్షలు జరుగుతున్నాయి. స్థానిక 24వ వార్డు కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు,


అమలాపురం చేపల మార్కెట్ ప్రాంతంలో ప్రజలకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

27వ వార్డు కౌన్సిలర్ బండారు గోవిందు తమ వార్డుల్లో ఈ శిబిరాలను పర్యవేక్షించారు.

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. విలసవిల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసిన అనంతరం గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ఏఎన్ఎం గుబ్బన అనురాధ పాల్గొన్నారు.

నేడు గోవలంకలో ప్రారంభం

తాళ్లరేవు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం గోవలంక పంచాయతీలో ప్రారంభించను


విలసవిల్లిలో సర్వేను పరిశీలిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి


అల్లవరంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

న్నట్లు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. అక్కడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి పీహెచ్‌సీ వైద్యుడు ఆర్.ఈశ్వర్ కుమార్‌తో పాటు మరి కొంతమంది నిపుణులు హాజరై వైద్య పరీక్షలు చేస్తారన్నారు.

చెడీ తాలింఖానా వార్షికోత్సవ పోస్టర్ల విడుదల

అమలాపురం టౌన్: అమలాపురంలో వచ్చే నెల 25న జరుగనున్న విజయ దశమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక మహిపాలవీధి అబ్బిరెడ్డి రామదాసు చెడీ తాలింఖానా 168వ వార్షికోత్సవ పోస్టర్లను ఆ వీధిలో శుక్రవారం విడుదల చేశారు. ఆ రోజు జరిగే మహిపాలవీధి వాహనం ఊరేగింపుల్లో అబ్బిరెడ్డి రామదాసు చెడీ తాలింఖానా బృందం కర్రలు, కత్తులు తదితర ఆయుధాలతో ప్రదర్శన చేయడం ఆనవాయితీగా వస్తోంది. దసరా ఉత్సవాల ఊరేగింపుల్లో పాల్గొనే ఏడు వీధుల్లో ఒకటైన మహిపాలవీధి చెడీ తాలింఖానా బృందం సమావేశమై పోస్టర్లను విడుదల చేయడమే కాకుండా ఆ రోజు ఊరేగింపు నిర్వహించే అంశంపై చర్చించింది. ప్రతినిధులు అబ్బిరెడ్డి సురేష్, దూడల ఫణి, అబ్బిరెడ్డి నరసింహారావు, తిక్కిరెడ్డి సురేష్, ఆకుల ఈశ్వరరావు, పైడికొండల రంగబాబు, పప్పొప్పుల తనీష్, గారపాటి బాలాజీ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా గోవిందకుమార్



తాళ్లరేవు: వైఎస్సార్ సీపీ తాళ్లరేవు మండల అధ్యక్షునిగా రెండోసారి కాదా గోవిందకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తనపై నమ్మకంతో రెండో సారి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

అమలాపురం టౌన్: స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సఫాయి మిత్ర సురక్ష సివర్ పేరిట పారిశుధ్య విభాగ కార్మికులకు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ప్రారంభించారు. డాక్టర్ హారిక ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సేవలు అందించారు. సుమారు 150 మంది పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కమిషనర్ నాయుడు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలను రోజుకో అంశంతో నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబర్ 1న మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమం


వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ నాయుడు

ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మున్సిపల్ ఇంజినీర్ కె.వెంకటేష్, పారిశుధ్య అధికారులతో పాటు 15 వార్డు సచివాలయాల పర్యావరణ, పారిశుధ్య కార్యదర్శులు బండి వీరన్న, దుర్గారావు పాల్గొన్నారు.


అక్షయ పాత్రకు దాతల సహకారం

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లో శ్రీఆది శేష నిలయంలో నిర్వహిస్తున్న పలు హోమాలు, గోశాలలోని గోవులకు దాతలు పలు వస్తువులు, పదార్థాలను సమకూర్చారు. శ్రీఆది శేష నిలయంలో పితృ, పితృ దేవతా మహోత్సవాలను పురస్కరించుకుని ప్రస్తుతం జరుగుతున్న మహా లయ పక్షం (15 రోజులు) కాలభైరవ శాంతి హోమ సమయంలో వీటిని ఉపయోగించాలని దాతలు అన్నారు. ఇందుకూరి రజిత పక్షుల ఆహారం నిమిత్తం రూ.16 వేల విలువైన బూందీని, ఓ అజ్ఞాత భక్తుడు వీధి శునకాల నిమిత్తం రూ.30 వేల విలువైన రెండు క్వింటాళ్ల ఆహార పదార్థాలు, లంకల గన్నవరానికి చెందిన వేమన రామానుజయ్య స్థానిక శ్రీగౌతమ గోసంరక్షణ సమితి గోశాలకు చెందిన గోవులకు రూ.16 వేల


దాతలు సమకూర్చిన వస్తువులు, పదార్థాలతో అక్షయపాత్ర, గోశాల సేవకులు

విలువైన పచ్చిగడ్డిని సమకూర్చారు. ఈ వస్తువులు, పదార్థాలను అక్షయపాత్ర, గోశాల సేవకులకు శుక్రవారం దాతలు అందజేశారు.

కల్యాణం.. వైభోగం


పీఠాధిపతి కామేశ మహర్షి పర్యవేక్షణలో సిద్ధి బుద్ధి సహిత గణపతి కల్యాణం


అమలాపురంలో గణపతి లడ్డూతో శ్రీచైతన్య కళాశాల సిబ్బంది


వీరేశ్వరస్వామి ఆలయంలో చండీ హోమం చేస్తున్న అర్చకులు


చింతలమెరక వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

అమలాపురం టౌన్: స్థానిక శ్రీకామాక్షీ పీఠంలో వినాయక నవరాత్ర ఉత్సవాల సందర్భంగా శ్రీసిద్ధి బుద్ధి సహిత గణపతి కల్యాణ మహోత్సవం గురువారం కనుల పండువగా జరిగింది. కామాక్షీ పీఠాధిపతి కామేశ మహర్షి పర్యవేక్షణలో శైవాగమ విద్వాన్ నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో పది మంది రుత్వికులు ఈ కల్యాణం నిర్వహించారు. పీఠం ఉత్తరాధికారి బాల బ్రహ్మచారి విఘనస రాఖి ప్రేమ్ కూడా స్వామి దివ్య కల్యాణ నిర్వహణలో పాల్గొన్నారు. సిద్ధి బుద్ధి సహిత గణపతి కల్యాణోత్సవం కోనసీమలోనే మొదటి సారిగా జరిగిందని పీఠాధిపతి కామేశ మహర్షి అన్నారు. గణపతి గీతాలాపనతో పీఠం మార్మోగింది. కల్యాణం అనంతరం భక్తులకు బెల్లం పానకాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు.

ముమ్మిడివరం: చింతలమెరక ఆంజనేయస్వామివారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ దర్శించుకున్నారు. చవితి ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో స్వామివారిని వృద్ధ గౌతమి గోదావరిలో నిమజ్జనం చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

స్వామివారి లడ్డూను రూ.18,500కు వేలంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ రెడ్డి హేమసుందరి, శివన్నారాయణ దక్కించుకున్నారు.

అమలాపురం టౌన్: స్థానిక శ్రీచైతన్య కళాశాల క్యాంపస్‌లో నెలకొల్పిన గణపతి విగ్రహం వద్ద లడ్డూకు శుక్రవారం వేలం నిర్వహించారు. కళాశాల యాజమాన్యంలోని అన్ని విభాగాల సిబ్బంది కలిపి రూ.50 వేలకు లడ్డూను పాడుకున్నారు. వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మంగళంపల్లి అంజిబాబు, కళాశాల అసోసియేట్ డీన్ వేగి రాంబాబు, ప్రిన్సిపాల్ జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: బండారులంక చినచిద్రపురంలో లక్ష్మీగణపతి ఆలయంలో స్వామివారి లడ్డూను రూ.18,100కు వేలంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, రుద్ర దంపతులు, సొసైటీ మాజీ అధ్యక్షుడు దంగేటి వీర వెంకట సత్యనారాయణ దక్కించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పగంటి భాస్కరరావు, సభ్యుడు కాలేవు భీమేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీ హోమం

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి తిథిని పురస్కరించుకుని ఆలయంలో శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో పలువురు పండితులచే గణపతి పూజ, చండీ పారాయణ, చండీ హోమం వైభవంగా నిర్వహించారు.

ముత్యాలమ్మకు క్షీరాభిషేకం

తాళ్లరేవు: భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకుని పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి శ్రీరంగాచార్యులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు విళ్ల సత్యనారాయణ, విళ్ల వీర, ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి సుబ్బారావు, పాము తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని చాటేలా..


గొల్లవిల్లిలో జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. నా భూమి- నా దేశం కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలతో ముందుకు సాగారు. అనంతరం పిల్లలకు రంగోలి, పాటలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హెచ్ఎం ఎల్.రాణి, పీడీ గొలకోటి ఫణీంద్ర, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కాట్రేనికోనలో..

కాట్రేనికోన: విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం మేరా మట్టి-మేరా దేశ్ కార్యక్రమాన్ని చేపట్టిందని హెచ్ఎం వెంకటేశ్వర్లు అన్నారు. కాట్రేనికోన జెడ్పీహెచ్ స్కూల్‌లో ఆయన అధ్యక్షతన మేరా మట్టి- మేరా దేశ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భరత మాత వేషధారి ముందు సాగగా 550 విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ చేశారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు హోరెత్తాయి.

ప్రాధాన్యం ఇవ్వాలి

అమలాపురం టౌన్: దేవదాయ శాఖ దేవస్థానాల్లో నాద స్వరం వాయించే పోస్టులను అనాధిగా నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికే కేటాయిస్తున్నారని జిల్లా వాయిద్య కళాకారుల సంఘ అధ్యక్షుడు ర్యాలి లోవరాజు అన్నారు. ఈ మేరకు అమలాపురంలో శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల నాదస్వరం పోస్టులను వేరే సామాజిక వర్గాలకు చెందిన కొందరు ధ్రువీకరణ పత్రాలు చూపించి కైవసం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్య పట్ల అధ్యయనం చేయాలని ఆయన కోరారు.



యువకుడికి తీవ్రగాయాలు

తాళ్లరేవు: కాకినాడ- యానాం రహదారిలోని జార్జిపేట నందిబొమ్మ మలుపులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ నుంచి అమలాపురం వెళుతున్న ఆర్టీసీ బస్సును నీలపల్లికి చెందిన వర్మ బైక్‌పై వచ్చి బలంగా ఢీకొన్నాడు. వర్మ తలకు తీవ్రగాయమైంది. ఆ సమయంలో అటుగా వస్తున్న ఓ ఆటోడ్రైవర్‌కు గాయపడిన వ్యక్తి తెలియడంతో క్షతగాత్రున్ని హుటాహుటిన యానాం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లాడు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కోరంగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలాఉంటే క్షతగాత్రుడిని ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు 108 అంబులెన్స్ కోసం పలువురు ఫోన్ చేయగా సిబ్బంది సరిగ్గా స్పందించలేదని వారు అసహనానికి గురయ్యారు.

పనులు ప్రారంభించాలని వినతి

యానాం: నియోజకవర్గంలోని ధనలక్ష్మీనగర్ రహదారి అభివృద్ధికి ఎంపీ నిధులు మంజూరు చేసి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించడం లేదని యానాం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్దాని దినేష్, నాయకుడు కాటంశెట్టి రామ్మూర్తి తదితరులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ అరుల్ ప్రకాశంకు వినతిపత్రం అందజేశారు.